
2లో

# కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రతి ఇంటికి వివరించాలి

- నియోజకవర్గ వైకాపా ఇన్చార్జి అన్నా

RK అగ్ని న్యూస్
The Power Of Truth
9441533080 - 8309890844
జులై : 23 బుధవారం సంపుటి : 29 సంచిక : 168

ఏపీలో జిల్లాలు,మండలాల పేర్లు మార్పులపై

# మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు




(అగ్ని ప్రతినిధి,అమరావతి)

ఏపీలో జిల్లాలు, మండలాలు, గ్రామాల సరిహద్దుల పేర్లు మార్పులు చేర్పుల కోసం అధ్యయనం చేసేందుకు మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. దీనిలో సభ్యులుగా ఏడుగురు మంత్రులను నియమించింది. వీరిలో అనగాని సత్యప్రసాద్, పొంగూరు నారాయణ, వంగలపూడి అనిత, బీసీ జనార్దన్ రెడ్డి, నిమ్మల రామానాయుడు, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్ ఉన్నారు.దీనికి కన్వీనర్గా రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వ్యవహరిస్తారని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. జిల్లా, రెవెన్యూ డివిజన్, మండల సరిహద్దుల మధ్య దూరాన్ని పరిగణనలోకి తీసుకోవాలని, సరిహద్దులు నిర్ణయించే ముందు స్థానిక ప్రాంతం చారిత్రక, సాంస్కృతిక నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకోవాలని మంత్రివర్గ ఉపసంఘానికి ప్రభుత్వం సూచించింది.

రైతుల సంక్షేమమే

# కూటమి ప్రభుత్వ ధ్యేయం

ఆగష్టు 15 నుంచి రైతులకు అన్నదాత సుఖీభవ




- రైతుల పై జగన్ రెడ్డి మొసలి కన్నీరు
- ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి

2లో

# స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బంగారు కుటుంబాలకు మార్గదర్శకులుగా నిలవాలి



- జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ

అగ్ని న్యూస్,ఒంగోలు (జులై 22):

మానవ సేవే మాధవ సేవగా గుర్తించి సహాయార్థులకు అండగా నిలిచేందుకు తమ వంతు బాధ్యతగా స్వచ్ఛందంగా ముందుకు రావాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాల కృష్ణ పిలుపునిచ్చారు. పీ - 4 పథకం లో భాగంగా ప్రభుత్వం గుర్తించిన బంగారు కుటుంబాలకు మార్గదర్శకులుగా నిలవాలని ఆయన సూచించారు. హెూల్ సేల్ డీలర్స్ అసోసియేషన్స్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్స్, ఎల్పిజి గ్యాస్ డీలర్స్ అసోసియేషన్స్, పెట్రోల్ బంక్ ఓనర్స్ అసోసియేషన్స్, హెూటల్స్ - రెస్టారెంట్స్ ఓనర్స్ అసోసియేషన్స్, సినిమా థియేటర్స్ ఓనర్స్ అసోసియేషన్స్, తూనికలు - కొలతల డీలర్స్ అసోసియేషన్స్ ప్రతినిధులతో మంగళవారం ప్రకాశం భవనము లో ఆయన వేరువేరుగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న పీ - 4 పథకం గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈ ప్రతినిధులకు జాయింట్ కలెక్టర్ వివరించారు. సమాజంలో ఆర్దికంగా పై స్థాయిలో ఉన్న 10 శాతం ప్రజలు, కింది స్థాయిలో పేదరికంతో బాధపడుతున్న 20 శాతం కుటుంబాలకు పలు రకాలుగా చేయూతనిచ్చి పేదరికాన్ని ఆయా కుటుంబాలు అధిగమించేలా చూడడమే ఈ పథకం ఉద్దేశమని తెలిపారు. ఈ దిశగా చేయూత అవసరమైన కుటుంబాలు మన జిల్లాలో 74 వేలకు పైగా ఉన్నట్లు గుర్తించామన్నారు. వీటిని ' బంగారు కుటుంబాలు'గా పేర్కొంటున్నట్లు చెప్పారు. ఆయా కుటుంబాలకు వెన్నుదన్నుగా నిలిచే వారిని మార్గదర్శకులు అని పేర్కొంటున్నట్లు తెలిపారు. మార్గదర్శకులు ఆర్థిక సహాయమే చేయాలన్నది ఈ పథకం ఉద్దేశం కాదని, బంగారు కుటుంబాలు పేదరికాన్ని అదిగమించేలా వివిధ రకాలుగా మార్గదర్శకం చేయాల్సి ఉంటుందన్నారు. ఆయా అవసరాలను, కుటుంబాలను సచివాలయ సిబ్బంది ద్వారా ఇప్పటికే గుర్తించామన్నారు.ప్రత్యేకంగా రూపొందించిన వెబ్ సైట్ లో ఈ వివరాలనుపొందుపరిచినట్లు చెప్పారు. ఈ జాబితాను అందజేస్తామని, పరిశీలించి అవసరమైన, చేయగల సహాయం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని జాయింట్ కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ జాబితాలో లేని కుటుంబాలకు కూడా అవసరం అని గుర్తించి తమకు తెలియజేస్తే వాటిని కూడా ఇందులో చేర్చుతామని తెలిపారు. స్వచ్ఛందంగా మార్గదర్శకులుగా ముందుకు రావాలని,శక్తి మేరకు ఎన్ని కుటుంబాలనైనా దత్తత తీసుకునే వెసులుబాటు ఉందని జాయింట్ కలెక్టర్ తెలిపారు. జ్ఞానాన్ని, ధనాన్ని పేదల కోసం ఖర్చు చేస్తే పుణ్యం వస్తుందని పెద్దలు చెప్తుంటారని, మానవ సేవే మాధవ సేవగా పలు మత గ్రంథాలు సైతం ప్రస్తావించాయని అన్నారు. ముఖ్యమంత్రి .నారా చంద్రబాబు నాయుడు సైతం ఇదే స్ఫూర్తితో పీ- 4పథకాన్ని ప్రవేశపెట్టారని ఆయన తెలిపారు.ముఖ్యమంత్రి ఆలోచనలు, ఆశయ సాధనకు అనుగుణంగా సహాయం చేసే శక్తి ఉన్న వారందరూ తమ వంతు బాధ్యతగా, స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పేదరిక రహిత సమాజ ఆవిష్కరణలో భాగస్వాములు కావాలని జాయింట్ కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ సమావేశాలలో డిఎస్ఓ పద్మశ్రీ, జిల్లా పౌరసరఫరాల సంస్థ జనరల్ మేనేజర్ వరలక్ష్మి,ఇతర అధికారులు పాల్గొన్నారు.

పంతులు
మెస్
ఆర్టిసి బస్టాండ్ దగ్గర, మార్కాపురం

## కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రతి ఇంటికి వివరించాలి

**మొదటి పేజి తరువాయి ....**

అగ్ని న్యూస్,పొదిలి (జులై 22): కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పాలన గాడి తప్పింది అని, కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రతి ఇంటికి వెళ్ళి వివరించాలని వైయస్సార్ కాంగ్రెసు పార్టీ మార్కాపురం నియోజకవర్గ సమన్వయకర్త అన్నా రాంబాబు పిలుపునిచ్చారు. స్థానిక శ్రీమంజునాథ కళ్యాణమండపంనందు మంగళవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గిద్దలూరు మాజి శాసన సభ్యులు, మార్కాపురం నియోజకవర్గ వైయస్సార్సీపీ సమన్వయకర్త అన్నా రాంబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రతి ఇంటికి వెళ్లి తెలియజేయాలి అని, చంద్రబాబు మేనిఫెస్టో రీసైక్లింగ్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకొని వెళ్ళాలని అన్నారు. కార్యక్రమంలో మండల వైకాపా నాయకులు సాయి రాజేశ్వరరావు, నరసింహ రావు, సంజీవరెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, రమణారెడ్డి, వెంకట రెడ్డి, శేషగిరిరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**మొదటి పేజి తరువాయి ....**

అగ్ని న్యూస్,గిద్దలూరు (జులై 22): రైతుల సంక్షేమమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ ధ్యేయమని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. సు పరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని కొంగలవీడు, బయనపల్లె, కొమ్మునూరు గ్రామాల్లో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి పర్యటించారు. కొంగలవీడు గ్రామంలో రూ.15 లతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. కొంగలవీడు గ్రామం నుండి నరవ గ్రామానికి రూ. 3 కోట్ల 20 లక్షలతో నిర్మించిన ఆర్ అండ్ బీ రోడ్డును ప్రారంభించారు. వేములపాడు, కొమ్మునూరు గ్రామాల్లో రూ. 20 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఏడాది పాలనా కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని,మహిళా సంక్షేమానికి, రైతుల సంక్షేమానికి, యువత భవిష్యత్తు కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. గత వైసీపీ పాలకులు రైతులను నట్టేట ముంచిందని, రైతుల పేరు చెప్పుకొని నాడు అధికారంలోకి వచ్చి రైతుల మోటార్లకు మీటర్లు బిగించిన ఘనత జగన్ రెడ్డి దేనని అన్నారు. కూటమి పాలనలో రైతుల సంక్షేమం కోసం, గిట్టుబాటు ధరలు, పొగాకు, మామిడి కొనుగోళ్లకు కృషి చేస్తుంటే వైసీపీ అధినేత జగన్ రెడ్డి మాత్రం మొసలి కన్నీరు కార్చటం సిగ్గుచేటు అన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఇచ్చిన మాట ప్రకారం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు రూ. 20 వేలు అందచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, జడ్పీటీసీ సభ్యులుబుడతా మధుసూదన్, పంచాయతీ రాజ్ డీఈ ఎన్ వి సుబ్బారెడ్డి, సర్పంచులు రామసుబ్బారెడ్డి, కడియం శేషగిరి, సొసైటీ బ్యాంకు డైరెక్టర్లు బద్రి గోపాల్ రెడ్డి,మండల నాయకులు నంది శ్రీను, తదితరులు పాల్గొన్నారు.




**ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో :**

## బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని మార్గదర్శకులుగా మారుదాం





**– యర్రగొండపాలెం ఇంచార్జ్ ఎరిక్షన్ బాబు**

అగ్నిన్యూస్,యర్రగొండపాలెం(జులై22): పట్టణంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో జీరో పావర్టీ పి4 విధానంపై అవగాహన సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ జీరో పావర్టీ పీ4 విధానం అనేది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చే ఆంధ్రప్రదేశ్‌లో 2047 నాటికి పేదరిక నిర్మూలన లక్ష్యంగా రూపొందించిన ఒక ప్రతిష్టాత్మక కార్యక్రమని, స్వర్ణాంధ్ర–2047 దీర్ఘకాలిక లక్ష్యంలో భాగంగా, పబ్లిక్–ప్రైవేట్–పీపుల్ పార్టనర్‌షిప్ (పి4) మోడల్ ద్వారా అమలు చేయబడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పేద వర్గాల ప్రాంతాలను తనకు నివేదిక ఇస్తే వాటిని దత్తత తీసుకుని వారి జీవన ప్రమాణాల అభివృద్ధికి సహకరిస్తానని అధికారులకు తెలిపారు. అదే విధంగా నియోజకవర్గంలోని ప్రభుత్వ, రాజకీయ, వివిధ వర్గాల పెద్దలు ముందుకు వచ్చి బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని మార్గదర్శకులుగా మారాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 5 మండలాల అధికారులు, ప్రత్యేక అధికారి, కూటమి నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పెండింగ్లో ఉన్న గవర్నమెంట్ హాస్పిటల్ శానిటరీ వర్కర్స్ 4 నెలల వేతనాలు వెంటనే ఇవ్వాలి



**– కార్మికుల పీఎఫ్ అమౌంటును వారి ఖాతాలలో జమ చేయాలి**

అగ్నిన్యూస్,మార్కాపురం(జులై22):ఏపీ గవర్నమెంట్ హాస్పిటల్ శానిటరీ వర్కర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ లో ఉన్న నాలుగు నెలల వేతనాలు, కార్మికుల పీఎఫ్ ఖాతాలో వేతనంలో కట్ చేసిన నగదును వెంటనే జమ చేయాలని స్థానిక ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సూపరిండెంట్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి డి కె యం రఫీ మాట్లాడుతూ నాలుగు నెలలుగా కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా కార్మికుల చేత చాకిరీ చేయించుకుంటున్నారని,పెండింగ్ లో ఉన్న కార్మికుల నాలుగు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులకు అతి తక్కువ వేతనాలు చెల్లిస్తూ ఇచ్చే వేతనాన్ని కూడా నెల నెల ఇవ్వకుండా నెలల తరబడి కార్మికులకు వేతనాలు పెండింగ్లో ఉంచడానికి ఆయన ఖండించారు. వేతనాలు చెల్లించకుండా కార్మికుల చేత పనిచేస్తున్న ఫస్ట్ ఆబ్జెక్టివ్ ప్రైవేట్ లిమిటెడ్ ఏజెన్సీ విజయవాడ తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల వేతనాలు నుండి పిఎఫ్ పేరుతో అమౌంట్ కట్ చేస్తూ వారి పిఎఫ్ ఖాతాలకు జమ జమ చేయకుండా, కాంట్రాక్టర్ షేర్ ను కూడా జమ చేయడం లేదని అన్నారు. పిఎఫ్ సంబంధించిన ఎటువంటి సమాచారాన్ని కాంట్రాక్టర్ అందించకుండా కార్మికులను ఇబ్బందుల గురిచేస్తున్నారని అన్నారు. జీతాలు అందకపోవడంతో కుటుంబాలు గడవక అప్పులు చేసి జీవనం సాగిస్తున్నారని అన్నారు. హాస్పిటల్లో రోగులకు హాస్పిటల్ ను శుభ్రం చేస్తూ విధులు నిర్వహిస్తున్న కార్మికులకు జీతాలు అందకపోవడంతో సరైన ఆహారం లేక కార్మికుల కుటుంబాలు అనేక రోగాల గురవుతున్నాయని ఆయన ఆవేదన చెందారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ కు పలుమార్లు విన్నవించుకున్న సమస్య పరిష్కరించలేకపోయారని అన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని కార్మికులకు పెండింగ్లో ఉన్న జీతాలు పిఎఫ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల చివరికి పెండింగ్ వేతనాలు ఇవ్వనిచో ఎప్పుడైనా సమ్మెలోకి వెళ్తామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కే రూబెన్, అందే సురేష్ స్వప్న, బాలకృష్ణ, కొండమ్మ మల్లికార్జున, మీరంబి, నాగమణి, నూర్జహాన్, అరుణ రవణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## కట్టుకథలు అల్లి కేసులు పెట్టడం చంద్రబాబుకు అలవాటే



**- వైసీపీ స్టేట్ యూత్ వింగ్ సెక్రటరీ, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి**

అగ్నిన్యూస్,గిద్దలూరు(జులై22): కట్టుకథలు అల్లి కేసులు పెట్టడం చంద్రబాబుకు అలవాటేనని వైసీపీ స్టేట్ యూత్ వింగ్ సెక్రటరీ, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ నెమలిదిన్నె చెన్నారెడ్డి అన్నారు.రెంటపాళల్లో పోలీసులు, కూటమి నాయకుల వేధింపులు తట్టుకోలేక వైయస్ఆర్‌సీపీ నేత ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. ఆ కుటుంబాన్ని పరామర్శించడానికి వైయస్ జఇన్ వచ్చారు.దానికి స్కామ్ అని పేరు పెట్టి వైయస్ఆర్‌సీపీ నేతల్ని జైలుకు పంపడం సాధారణంగా మారిపోయింది.ఎంపీ మిథున్ రెడ్డి అరెస్ట్ దారుణం. అక్రమ కేసు పెట్టి మిథున్ రెడ్డి నీ జైలుకు పంపారు. వైయస్ జఇన్ మళ్లీ సీఎం అయ్యే దాకా.. ఈ ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ఎన్ని ఇబ్బందులు పెట్టినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం అని నెమలిదిన్నె చెన్నారెడ్డి స్పష్టం చేశారు.

## కుక్కల దాడిలో గాయపడిన ఉపాధ్యాయుడు



అగ్ని న్యూస్,కంభం (జూలై 22): మండలం లోని కందులాపురం కాలనీ సమీపంలో కుక్క లు బైకు వెంటపడి దాడి చేయడం వల్ల ఎంతోమంది గాయపడ్డారు. పంచాయతీ వాళ్ళకి ఎన్నిసార్లు కంప్లైంట్ ఇచ్చిన నిమ్మకు నీరెత్తి నట్టు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.మంగళవారం ఉదయం 8-30 నిముషాలకు బైక్ పై వేలుతున్న చాట్ల బాబు (టీచర్ )ను నాలుగు కుక్కలు బైకు వెంటపడి బైకును కిందపడేలా చేసి గాయపరచాయి. ఇప్పటికి అయినా పంచాయితీ వారు కుక్కల నుండి ప్రజల ప్రాణాలకు ఇబ్బంది లేకుండా చేయగలరా లేదా అని ప్రజలు అనుకుంటున్నారు.

## పత్తి మినుము పంటలలో పురుగుల ఉధృతి నివారణ పై అవగాహన




అగ్నిన్యూస్,యర్రగొండపాలెం(జులై22): మండలంలోని గంగపాలెం, నర్సాయపాలెం గ్రామాలలోని గ్రామ రైతు సేవ కేంద్రం నందు వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, పట్టు పరిశ్రమ శాఖ, మార్కెటింగ్ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా ఆయా గ్రామాల్లో ఉన్న రైతు సోదరులతో కలిసి ప్రస్తుతం సాగు చేస్తున్న ప్రత్తి, మినుము పంటలను మండల వ్యవసాయ అధికారి కె. నీరజ క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పత్తి పంటలో తెల్ల దోమ మొదలగు రసం పీల్చు పురుగుల ఉధృతి నీ తెలుసుకోవడానికి పసుపు రంగు,నీలపు రంగు జిగురు అట్టలు వాడాలని, గులాబీ రంగు పురుగులు రాకుండా లింగాకర్షణ బుట్టలు పెట్టి ముందు జాగ్రత్తలు తీసుకోవాలని. కంది పంట రైతులు సకాలంలో ట్రైకోడెర్మా రైజోబియం విత్తనశుద్ధి చేసుకున్న విత్తనాలు విత్తుకోవాలి అని సూచించారు. అనంతరం రైతు సేవ కేంద్రం వద్ద గ్రామసభ నిర్వహించటం జరిగినది.ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి పి.ఆది రెడ్డి, ఉద్యాన వన పంటలకు సంబంధించి ప్రభుత్వ పథకాలు వివరించారు. సాగుచేసిన ప్రతి పంటను ఈ.పంట నమోదు చేసుకోవాలి అని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో సెరికల్చర్ టి ఏ ప్రసన్న, ఏ ఈ ఓ టి. పొట్టయ్య,డి.ధనేశ్వర్ నాయక్. ఆర్ ఎస్ కే సిబ్బంది ఆర్.మంత్రు నాయక్ వి ఏ ఏ, ఏ. క్రిష్ణ కిరణ్ నాయక్ వి ఏ ఏ రైతులు పాల్గొనారు ..



## మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన

అగ్నిన్యూస్,కొమరోలు(జులై22): జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని కొమరోలు గ్రామంలో ప్రధాన మంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన 2025 క్రింద ఖరీఫ్ సీజన్ నందు సాగు చేసే పంటలలో చేపట్టవలసిన మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమం నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గిద్దలూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ కార్యదర్శి బిజ్జాల తిరుమల రెడ్డి, కొమరోలు సొసైటీ చైర్మన్ ముత్తుముల సంజీవరెడ్డి పాల్గొన్నారు.ఎ.ఎం.సి కార్యదర్శి బిజ్జాల తిరుమలరెడ్డి మాట్లాడుతూ రైతులు ప్రతికూల వాతావరణ పరిస్థితులకు, చీడపీడలకు తట్టుకునే మేలైన వంగడాలను ఎంపిక చేసుకుని సాగు చేయాలని తెలియజేశారు. నీటి వనరులను సద్వినియోగ చేసుకునేందుకు డ్రిప్ పద్ధతిని పాటించాలని తెలియజేశారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయధికారి ఎ.శైలజ భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువుల యాజమాన్యం, వరి, కంది, మొక్కజొన్న, మినుము, నువ్వులు, మిరప పంటలలో విత్తనం వేసే దగ్గర నుండి పంట కొత్త వరకు చేపట్టవలసిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి, జీవన ఎరువుల ప్రాముఖ్యత గురించి వివరించారు. మండల వ్యవసాయ అధికారి కె.రాజశ్రీ ఈ-పంట నమోదు, పంటల భీమా మొదలైన అంశాల గురించి వివరించారు.ప్రకృతి వ్యవసాయం గిద్దలూరు విభాగం మాస్టర్ ట్రైని మద్దిరెడ్డి ప్రకృతి వ్యవసాయం యొక్క ప్రాముఖ్యతను, వేప గింజల కషాయం, నీమాస్త్రం తయారీ విధానం గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు పి.కౌసర్, కె.శిరీష, గ్రామ వ్యవసాయ ఉద్యాన, పట్టుపరిశ్రమ సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో :

అగ్ని దిన పత్రికలో మీ ఇష్టమైన వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలపండి

కేవలం 499/- మాత్రమే only soft copy

## రేపటితో ముగియనున్న అన్నదాత సుఖీభవ పథకానికి గ్రీవెన్స్



అగ్నిన్యూస్,మార్కాపురం(జులై22):మండలంలోని తిప్పాయపాలెం, మాల్యవంతునిపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారిని బంజ్జిబాయ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలొ ఏ ఓ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధిచి అర్హులై జాబితా నందు పేర్లు రానివారు ఈ నెల 23 లోపు రైతు సేవ కేద్రం ను సంప్రదిండి గ్రీవెన్స్ నమోదు చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా పంట సాగుచేసి ప్రతి రైతు పంటల భీమా పథకం కింద మీ పేరు ను నమోదు చేసుకో గలరు అని తెలియజేసారు. వరి 860, కంది 430, పత్తి, ఏడుమిరప 4500,మినుములు 205, ఎకరానికి ప్రీమియం చెల్లిచవలనని తెలియజేసారు. భూసారా పరీక్షఫలితల ఆధారంగా ఎరువులు ఉపయోగించుకోవాలని తెలియ జేశారు. ఉద్యనావాన అధికారి డి.రమేష్ మాట్లాడుతు ఉద్యానవన డిపార్ట్మెంట్ వారు అందించు రాయితీ వివరాలు గురించి తెలియ పరిచారు. సమావేశం అనంతరం వంగపంటను పరిశీలించి సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగింది. 100% సబ్సిడీ కింద ఇచ్చినటువంటి మినుములు, కందులు కొంతమంది రైతులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తిప్పాయపాలెం మాల్యవంతునిపాడు వి ఏ ఏ లు, ఆయా గ్రామ రైతులు పాల్గొనడం జరిగింది.

## దేవరాజగట్టు, శివాపురంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం



అగ్నిన్యూస్,మార్కాపురం(జులై22): మండలంలోని దేవరాజగట్టు, శివాపురం గ్రామాల యందు మండల వ్యవసాయ అధికారి లక్ష్మీ నారాయణ అధ్యక్షతన పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన రైతులతో కలిసి ప్రత్తి పంటను పరిశీలించి, ప్రత్తి పంటలో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. దేవరాజగట్టు, శివాపురం గ్రామాల యందు సమావేశం నిర్వహించి రైతులకు కౌలు కార్డులు, పంటల బీమా పథకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఈ.ఓ సునీల్ నాయక్ టీడీపీ మండల పార్టీ కన్వీనర్ మెట్టు శ్రీనివాస రెడ్డి, వీ.ఏ.ఏ పి.శివ కుమార్, దేవరాజగట్టు, శివాపురం రైతులు పాల్గొన్నారు.

## కొండయాపాలెం మూగచింతలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం



అగ్నిన్యూస్,పొదిలి(జులై22): మండలంలోని కొండయాపాలెం మూగచింతల రైతు సేవా కేంద్రం నందు పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి దేవి రెడ్డి శ్రీనివాసులు మాట్లాడుతూ ఆహారం, పోషకాహార భద్రత పథకం లో భాగంగా 100 శాతం రాయితితో ప్రభుత్వం వారు సరఫరా చేస్తున్న కంది విత్తనాలను గ్రామ రైతుల అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన రైతులని కోరారు. అలాగే ప్రస్తుత%శీ% ఖరీఫ్ సీజన్ లో వేసినటువంటి పంటలకు తప్పనిసరిగా అందరూ క్రాఫ్ట్ ఇన్సూరెన్స్ చేయించు కోవాల్సిందిగా మండల వ్యవసాయ అధికారి తెలియజేశారు. అలాగే అన్నదాత సుఖీభవ -పీఎం కిసాన్ పథకానికి సంబంధించి వెబ్ ల్యాండ్ నందు మీ ఖాతాకీ ఆధార్ అనుసంధానం జరగని రైతులు మీ దగ్గర లోని సచివాలయంలో గానీ లేదా మీ సేవా కేంద్రం నందు సంప్రదించి తప్పనిసరిగా అనుసందించుకోవాలని ఆయన రైతులని కోరడం జరిగింది. అదేవిధంగా అన్ని రైతు సేవా కేంద్రాల లో అన్నదాత సుఖీభవ పి ఎం కిసాన్ అర్హుల జాబితా అందు బాటలో ఉంచడం అయినది ఆ జాబితా లో మీ యొక్క పేరు ఉందో లేదో కూడా చూడవచ్చునని తెలిపారు. ఇంకా వివరాలు తెలుసు కొనుటకు గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి సలహాలు పొందగలరని ఆయన కోరారుఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు, గ్రామ వ్యవసాయ సహాయకులు బి ఆది నారాయణరెడ్డి, ఆ గ్రామ రైతులు పాల్గొన్నారు.




## నవోదయ దరఖాస్తుల నమోదు పెరిగేలా ఎంఈఓ లు కృషి చేయాలి

అగ్నిన్యూస్,మార్కాపురం(జులై22): తర్లుపాడు మండలం లోని కలుజువ్వలపాడులో గ్రామ పరిధిలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో మంగళవారం డి ఇ ఓ ఆదేశాలను అనుసరించి పశ్చిమ ప్రకాశం జిల్లాలోని 27 మండలాల మండల విద్యాధికారుల సమావేశం జరిగింది. ఈ సమావేశం అధ్యక్షులు, నవోదయ ప్రిన్సిపల్ ముఖ్య అతిథిగా విచ్చేసిన మార్కాపురం డిప్యూటీ డిఈఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సభలో శ్రీనివాసులు మాట్లాడుతూ 6వ తరగతి జవహర్ నవోదయ విద్యాలయ సెలక్షన్ టెస్ట్ 2026 రిజిస్ట్రేషన్ల సంఖ్యను పెంచుటకు తమ పరిధిలో ఎంఇఓ లకు దిశ నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో విద్యాలయ ప్రిన్సిపల్ బ్రహ్మానందరెడ్డి ఆన్లైన్ అప్లికేషన్లు చేయునప్పుడు వచ్చే వివిధ సమస్యలను పూర్తిగా వివరించి మా విద్యాలయం నుంచి కూడా సహాయ సహకారాలు ఉంటాయని తెలియజేశారు. హెల్ప్ లైన్ నెంబర్లతో పాటుగా విచ్చేసిన అతిథులందరికి జె ఎన్ ఎస్ టి పోస్టర్లను, అప్లికేషన్లను అందచేశారు. విచ్చేసిన ఎంఈఓ లు అందరూ కూడా తమతమ మండలాల్లో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థుల ద్వారా అప్లికేషన్లు చేయించి ఈ సంవత్సరం కూడా జె ఎన్ వి యస్ టి కి తమ సహాయ సహకారాలను పరిపూర్ణంగా అందిస్తామని చెప్పడం జరిగింది. ఈ సభలోనే శ్రీనివాసులు ఎంఈఓలందరికీ తమ తమ మండలాలలో మంగళవారం జరిగినటువంటి సమావేశం గురించి,జె ఎన్ వి ఎస్ టి అప్లికేషన్ల చివరి తేదీ ఈ నెల 29 కావున త్వరగా జె ఎన్ వి యస్ టి అప్లికేషన్ యొక్క సంఖ్యను పెంచడంలో తమ పత్రిక ప్రకటనల ద్వారా కూడా చేయాల్సిందిగా కోరారు. విద్యాలయ జె ఎన్ వి యస్ టి ఇంచార్జ్ రత్నయ్య కృతజ్ఞతల ద్వారా ఈ సమావేశం ముగిసింది.

ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో :
అగ్ని దిన పత్రికలో మీ ఇష్టమైన వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలపండి
కేవలం 499/- మాత్రమే only soft copy



# సూరేపల్లి లో పొలం పిలుస్తోంది కార్యక్రమం

అగ్నిన్యూస్,తర్లుపాడు(జులై22)బీ సీతా నాగులవరం,సూరేపల్లి గ్రామాలలో మంగళవారం మండల వ్యవసాయ అధికారి పి. జోష్ణ దేవి పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మార్కాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు డి బాలాజీ నాయక్ రైతుల ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుతం పడిన వర్షాలకు పొలాలు పదునైనందున మెట్ట పంటలైన కంది, మినుము సాగు చేసుకోవాలని తెలియజేశారు. ప్రధాన పంటగా కందిని అంతర పంటగా మినుము పంటను సాగు చేసుకోవాలని తెలియజేశారు. వాణిజ్య పంటలైన మిరప, పొగాకు విస్తీర్ణాన్ని తగ్గించుకోవాలని తెలియజేశారు. మెట్ట పంటలు సాగు చేయటం వలన కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. తక్కువ పెట్టుబడితో దిగుబడులను పొందుకోవడానికి తగు సూచనలు చేశారు. కందిలో అంతర పంటగా మినుము వేసుకోవడం వలన పంటను తీసుకోవచ్చని, కాలం అనుకూలించని పక్షంలో మినుము పంటను భూమిలో కలియదున్ని సేంద్రియ పదార్ధాన్ని పెంచుకోవచ్చని తెలియజేశారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం,రాష్ట్ర ప్రభుత్వం వారు అందిస్తున్న కిసాన్ డ్రోన్ పథకాన్ని రైతులకు వివరించారు. ప్రభుత్వం వారు 80% సబ్సిడీతో మండలానికి ఒక డ్రోన్ కొనుక్కోవడానికి గ్రూప్ సభ్యులకు అవకాశం కల్పించిందని తెలియజేశారు. కిసాన్ డ్రోన్ వలన రైతులు తమ పంటలకు పురుగు మందులను పిచికారీ చేసుకోవడానికి వీలవుతుందని తెలియజేశారు. పెరుగుతున్న కూలీల కొరతను అధిగమించడానికి డ్రోన్లను రైతులు విధిగా వాడుకోవాలని చెప్పారు. నిరుద్యోగ యువతకు డ్రోన్ ఆపరేట్ చేయడానికి శిక్షణ ఇప్పించి వారి ద్వారా మండలంలో కావలసిన రైతులకు డ్రోన్ ద్వారా పురుగుమందులను పిచికారి చేయించుకోవచ్చని చెప్పారు. మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ కౌలు రైతులకు సిసిఆర్సి ,ఖరీఫ్ పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఈ- పంట నమోదు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ దేవేంద్ర గౌడ్,వి ఏ ఏ సయ్యద్ జిలాని, వెటర్నరీ అసిస్టెంట్ శ్వేత,సరికల్చర్ అసిస్టెంట్ సుధారాణి, ఏ ఎం సి పొదిలి సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.







ప్రపంచం ఇప్పుడు మీ చేతిలో : అగ్ని దిన పత్రికలో మీ ఇష్టమైన వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలపండి
కేవలం 499/- మాత్రమే only soft copy

## సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం



అగ్నిన్యూస్,మార్కాపురం(జులై22):మార్కాపురం నియోజకవర్గ అఖిలపక్ష పార్టీల సమావేశం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎలక్షన్స్ పోలింగ్ బూతుల రేషనలైజేషన్ గురించి వివరించారు. ఎలక్షన్ కమిషన్ సూచన మేరకు ఇకమీదట నుంచి ప్రతి పోలింగ్ బూతు 1200 ఓటర్స్ కు మించకుండా ఏర్పాటు చేయడం జరుగుతుంది అని సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కాపురం,తర్లుపాడు , కొనకనమిట్ల,పొదిలి తహసిల్దారులు, పార్టీల ప్రతినిధులు,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుండి రాష్ట్ర పోలింగ్ బూత్ కార్యదర్శి పత్తి రవిచంద్ర, తెలుగుదేశం పార్టీ నుండి జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ , బిజెపి పార్టీ నుండి ఆ పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్చార్జి పివి కృష్ణారావు, జనసేన పార్టీ నుండి విజయ నర్సింహారావు పాల్గొనడం జరిగింది.

## నేడు త్రిపురాంతక క్షేత్రంలో ఘటాభిషేకం,శాకంబరీ మహోత్సవాలు



అగ్నిన్యూస్,త్రిపురాంతకం(జూలై 22):మహ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వర స్వామి దేవస్థానం నందు ఆషాడ మాస శివరాత్రి పురస్కరించుకొని స్వామివారికి ఘటాభిషేకం, అమ్మవారికి శాకాంబరి అలంకార పూజా మహోత్సవాలు, అమ్మవారికి ఆషాడ మాస పసుపు కుంకుమ సారె కార్యక్రమం బుధవారం(నేడు) జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి ముందుగా ఉదయం 8 గంటలకు అమ్మవారి సారె ను స్వామి వారి విడిధి గృహము నుండి ఊరేగింపుగా దేవస్థానం దగ్గరకు బయలుదేరుననీ కావున భక్తులందరూ ఈ పూజ కార్యక్రమాల్లో పాల్గొని స్వామి అమ్మవార్ల కృపకు పాత్రులు కాగలరని ఆలయ కార్యనిర్వహణాధికారి అనీల్ కుమార్,ఆలయ అర్చకులు విశ్వనారాయణ శాస్త్రి లు కోరారు.



RK అగ్నిన్యూస్ The Power Of Truth

23 బుధవారం , జులై 2025

## త్రైత సిద్ధాంత భగవద్గీత కృష్ణాష్టమి ఊరేగింపు విశిష్టత పై ప్రచారం




అగ్నిన్యూస్,త్రిపురాంతకం(జులై 22): త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల వారి దివ్య ఆశీస్సులతో మంగళవారం త్రైతసిద్ధాంత ప్రబోధసేవాసమితి ఇందూజ్ఞానవేదిక దొనకొండ కమిటీ ఆధ్వర్యంలో త్రిపురాంతకం మండలంలోని గణపవరం, ఎండూరివారిపాలెం, మేడపి గ్రామాలలో త్రైత సిద్ధాంత ఆధ్యాత్మిక గ్రంథముల ఇందూ ధర్మ ప్రచారము నిర్వహించడం జరిగినది.శ్రీకృష్ణ భగవానుడి కి మాత్రమే ఊరేగింపు చేయాలని దేవుడే అవతరించి ఒక మనిషిగా జన్మిస్తే ఆయనను భగవంతుడు అని అంటాము...అలాంటి భగవంతుడే శ్రీకృష్ణుడు, ఆయనను మాత్రమే అందరూ దైవంగా గుర్తించాలి అని ఊరి లోని వారందరికీ ఎరుక పరచుటకు ఈ ఊరు ఎరిగింపు (ఊరేగింపు) కార్యక్రమం చేయడం జరుగుతుంది అని, పూర్వం కృష్ణాష్టమి 11 రోజుల పాటు చేసేవారు చివరిగా చవితి రోజున ఊరేగింపు చేసి ముగించేవారు. అని ప్రబోధ సేవా సమితి సభ్యులు తెలిపారు. (శ్రీ కృష్ణ పరమాత్మ ఊరేగింపు చేసిన గ్రామంలో ప్రకృతి వైపరీత్యాలు, రోగ బాధలు ప్రజలకు ఉండవు అని పూర్వం పెద్దలనెడివారనీ తెలిపారు.ఈ కార్యక్రమంలో త్రైతసిద్ధాంతం- ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక- దొనకొండ కమిటీ, అద్యక్షులు, సభ్యులు టి.ఏడుకొండలు, బి.రాములు, ఏ చెన్నకేశవులు, ఏ బాల రంగయ్య, టి నవీన్, ఏ కాశి లక్ష్మి, ఏ సుబ్బులు, పి ఆదిలక్ష్మి, బి సీతమ్మ, జి సరస్వతి, పి సుబ్బారెడ్డి, పి సరస్వతి లు పాల్గొన్నారు.



## ట్రాఫిక్ రూల్స్‌పై స్పెషల్ డ్రైవ్

అగ్నిన్యూస్,మార్కాపురం(జులై22): జిల్లా ఎస్పీ ఏ.ఆర్. దామోదర్ ఆదేశాల మేరకు, మార్కాపురం టౌన్, పలు ప్రాంతాలలో డీఎస్పీ నాగరాజు ఆధ్వర్యంలో పెండింగ్ చలానాలపై సాయంత్రం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.ఈ డ్రైవ్‌లో మొత్తం 106 పెండింగ్ చలానాలపై రూ.22,440 జరిమానా, అలాగే, 2 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయడం జరిగింది. మోడిఫై చేసిన సైలెన్సర్లు ఉన్న ద్విచక్ర వాహనాలను గుర్తించి, వాటికి కంపెనీ వారు చెందిన అసలు సైలెన్సర్లు అమర్చేలా చర్యలు తీసుకున్నారు. నెంబర్ ప్లేట్లు లేని 8 ద్విచక్ర వాహనాలను గుర్తించి, వాటికి నెంబర్ ప్లేట్లు వేయించేందుకు సూచనలు చేయడం జరిగింది.ఈ సందర్భంగా మార్కాపురం డీఎస్పీ యు నాగరాజు మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపకూడదని, మైనర్లు వాహనాలు నడపరాదని, అతివేగం, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని స్పష్టం చేశారు. మోడిఫై చేసిన సైలెన్సర్లు వాడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.హెల్మెట్ ధరించని వారి పై మోటారు వాహనాల చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం కూడా జరుగుతుందన్నారు. వాహనదారులు రోడ్డుపై ప్రయాణించే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్ ధరించడం ద్వారా మీ భద్రతతో పాటు మీ కుటుంబం ఆనందాన్ని కూడా కాపాడవచ్చని సూచించారు.ఈ స్పెషల్ డ్రైవ్‌లో మార్కాపురం సీఐ సుబ్బారావు, టౌన్ ఎస్సైలు ఎం. సైదులు బాబు, డాక్టర్ ఎం. రాజమోహన్ రావు, ట్రాఫిక్ ఎస్సై అహరోన్, రూరల్ ఎస్సై అంకమ్మ రావు తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన సదస్సు






అగ్నిన్యూస్,మార్కాపురం(జులై22): స్థానిక వాసవి విద్యానికేతన్ నందు మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే రంగయ్య ఏఓ రంజిత్ కుమార్ ల ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నియంత్రణ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పట్టణ రూరల్ ఎస్ఐలు సైదుబాబు, డాక్టర్ రాజమోహన్ లు పాల్గొని మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వాడడం సరికాదని వాటి వల్ల ఆరోగ్యం క్షీణిస్తుందని అలాగే వాహనాలపై ప్రయాణం చేసేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. సెల్ ఫోన్ వాడటం వల్ల కళ్ల ఆరోగ్యం దెబ్బతింటుందని తెలిపారు.ప్రిన్సిపల్ కే రంగయ్య మాట్లాడుతూ ఆరోగ్యం పై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించడం జరిగింది. మంచి విషయాలు వివరించినందుకు పాఠశాల యాజమాన్యం పోలీస్ శాఖ వారికి ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని జయప్రదం చేశారు.

## ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం



అగ్ని న్యూస్, కంభం (జూలై 22): జిల్లా ఎస్పీ ఏ.ఆర్. దామోదర్ ఆదేశాల మేరకు కంభంలో ఆటో డ్రైవర్లకు పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంభం సీఐ మల్లికార్జున, ఎంవిఐ మాధవరావు పాల్గొని ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించి, జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం గురించి వివరించారు. ఆటోకు ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలని, ఆటో నడిపే వ్యక్తి వద్ద చట్టపరంగా అమోదించిన డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలన్నారు. అలాగే పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలలో తరలించరాదని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలకు ఆటోలను ఉపయోగించరాదని, అనుమానిత వ్యక్తులు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఈ అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు సీఐ మల్లికార్జున తెలిపారు. ఈ కార్యక్రమంలో కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు మండలాల ఎస్సైలు నరసింహారావు, రవీంద్ర రెడ్డి, సుదర్శన్, లేబర్ ఆఫీసర్ బాలకాశి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




Printed, Published & Owned by K.V.RAMANA RAO, APTEL 0548/01/1997 SV Printers - Markapur.(K.Rama Krishna- 9441533080/ 8309890844)